# గడుసరి

విజయవాడ

4-3-1978

సింహగర్జన సంపాదకులకు—

మీకు గత నాలుగు సంవత్సరాలుగా టన్నులకొద్దీ కథల్ని పంపుతూనే వున్నాను. కానీ మీరు వాటిలో ఒక్కదాన్ని కూడా మిగుల్చు కోకుండా సాధ్యమైనంత త్వరలో వాటిని నా కందించే ఏర్పాట్లు చేస్తూనే వున్నారు. విసుగుచెందని విక్రమార్కునిలా నేను ప్రయత్నిస్తూనేవున్నాను. దయచేసి మీరు నా ఒక్క కథనయినా ప్రచురించి నా మీద 'రచయిత' అనే ముద్రని వేయవలసిందిగా మరీ మరీ కోరుతున్నాను. మీ సహకా రాన్ని అభ్యర్థిస్తూ—

—సింహాచలం.

విజయవాడ

7-2-1981

సింహగర్జన సంపాదకులకు—

ఈ మధ్య మీరు నాకిస్తున్న ప్రోత్సాహానికి నేనెంతో కృతజ్ఞుణ్ణి. 'ఇక నా కథలు ప్రచురింపబడవు, నేను రాయడం మానుకోవడం ఉత్తమం' అనే నిర్ణయానికి నేనొచ్చిన రోజుల్లో నా మొదటి కథను ప్రచు

రించి, తిరిగి నాలో ఉత్సాహాన్ని రేకెత్తించారు. మిగతా పత్రికలవాళ్ళు నా కథల్ని అడపాదడపా ప్రచురిస్తుంటే, మీరు అతి తరచుగా ప్రచురిస్తూ రచయితగా నాకో స్థానాన్ని కల్పిస్తున్నారు. మీ సహకారానికి కృతజ్ఞతలు తెల్పుకుంటూ—

—సింహాచలం.

విజయవాడ
10-5-1983

సింహగర్జన సంపాదకులకు—

ప్రత్యేకసంచికకి కథని పంపమని మీరు రాసిన ఉత్తరం అందింది. చూస్తున్నారుగా—ఈమధ్య ఏ పత్రిక చూసినా నా కథలే! తీరిక లేకుండా వుంటోంది. రెమ్యునరేషన్ పే చెయ్యడంలో కూడా ఒకరికొకరు పోటీ పడుతున్నారు. కాబట్టి మీరు వెంటనే అర్ధ వెయ్యినూటపదహార్లకి డ్రాఫ్ట్ పంపితే, నేను సాధ్యమైనంత త్వరలో కథను పంపుతాను. మీ అభిమానానికి సంతోషిస్తూ—

—సింహాచలం.

(జ్యోతి మాసపత్రిక)